వివరాలు వెల్లడిస్తున్న అద్వితీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ సొగాని కొమురయ్య

'అద్వితీ' స్కూల్‌కు కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ ఆమోదిత గుర్తింపు

కమాన్‌చౌరస్తా, జూలై 16 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో పదేళ్లుగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యా సేవలందిస్తున్న అద్వితీ ఇంటర్నేషనల్ పాఠశాలకు కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ ఆమోదిత అఫిలియేషన్ లభించిందని విద్యాసంస్థల చైర్మన్ సొగాని కొమురయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యాసంస్థల డైరెక్టర్ సొగాని అనుదీప్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోనే ప్రప్రథమంగా అద్వితీ ఇంటర్నేషనల్ పాఠశాలకు అంతర్జాతీయస్థాయి కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ గుర్తింపు దక్కడం సంతోషంగా ఉందన్నారు. ఆరు సంవత్సరాల నుంచి సంబంధిత అధికారులు పాఠశాలలోని మౌలిక వసతులు, విద్యా కల్పన, విద్యార్థుల ప్రగతి, విద్యార్థులు, తల్లిదండ్రులతో ఇంటర్వ్యూలు వివిధ పద్ధతుల్లో అసెస్ చేసి, పాఠశాలకు గుర్తింపును అందించారని చెప్పారు. ప్రస్తుత సమాజంలో విద్య ఒక ప్రాంతం, రాష్ట్రం, దేశాంతరాలను దాటి ప్రపంచ స్థాయి ప్రమాణాలను అందుకున్నదని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈతో పాటు వివిధ దేశాల విద్యార్థులతో పోటీపడేలా ఐజీసీఎస్ఈ కరికులం తోడ్పడుతుందన్నారు. ఈ కరికులంలో విద్యార్థులు ఐదు ప్రధాన సబ్జెక్టులతోపాటు అదనంగా హ్యూమానిటీస్, క్రిటికల్ థింకింగ్, ఇన్ఫర్మేషన్ అనాలసిస్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ లాంటి సబ్జెక్టులను ఎన్నుకోవాల్సి ఉంటుందని, ప్రధాన సబ్జెక్టులతో పాటు వీటిలో సాధించిన ప్రగతిని (ఏ నుంచి ఈ) గ్రేడ్లుగా మూల్యాంకనం చేస్తారని తెలిపారు. ఈ విధానంలో విద్యార్థులు యాక్టివిటీ బేస్డ్ లర్నింగ్, విద్యార్థి కేంద్రీకృత విధానం, ఒత్తిడి లేని విద్య ఉంటుందని, ఇది విద్యార్థుల సమగ్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడి, బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలలో ఉంటుందని తెలిపారు. ఇక్కడ పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్, ఆపై విద్యను విదేశాలలో సులభంగా ప్రవేశాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.

అభివృద్ధిపై ఎలాంటి విచారణకైనా సిద్ధం

- నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం ఏ నాయకుడినైనా కలుస్తాం
- బల్దియాకు రూపాయి నిధులు తీసుకురాని చేతకాని మంత్రి పొన్నం ప్రభాకర్
- దమ్ముంటే బల్దియాకు రూ.200 కోట్లు తీసుకొస్తే స్వాగతిస్తాం
- విలేకరుల సమావేశంలో మేయర్ సునీల్ రావు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ యాదగిరి సునీల్ రావు

రాంనగర్, జూలై 16 : నాలుగున్నర సంవత్సరాల్లో కరీంనగర్ నగరపాలక సంస్థలో జరిగిన అభివృద్ధిపై విజిలెన్స్, ఈడీ, సీబీఐ లాంటి ఎలాంటి విచారణకైనా తమ పాలకవర్గం సిద్ధంగా ఉందని నగర మేయర్ యాదగిరి సునీల్ రావు పేర్కొన్నారు. బెదిరింపులకు భయపడేవారు ఎవరూ లేరని, దమ్ముంటే ఎలాంటి విచారణ అయినా చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయన అనుచర వర్గానికి సవాల్ విసిరారు. విచారణలో వారు చేస్తున్న ఆరోపణలు అసత్యాలని తేలిపోతాయని.. అది తమకు మంచిదేనని పేర్కొన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థకు నయా పైసా నిధులు తీసుకురాని, చేతకాని మంత్రి పొన్నం అని దుయ్యబట్టారు. కరీంనగర్‌లో మంగళవారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్, ఆయన అనుచరులపై విరుచుకుపడ్డారు. కనీస పరిజ్ఞానం లేకుండా నగరపాలక సంస్థ అభివృద్ధి, పాలకవర్గంపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న విమర్శలను తీవ్రంగా ఖండించారు. మేయర్, కార్పొరేటర్లకు ఎలాంటి సమాచారం లేకుండా నగరపాలక సంస్థపై సమీక్షా సమావేశం పెట్టిన పొన్నం ప్రభాకర్ మర్యాద గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. నగరపాలక సంస్థ, జిల్లాతో ఎలాంటి సంబంధం లేని పొన్నం, ఆయన అనుచరులు పదే పదే నగర అభివృద్ధిపై మాట్లాడడం చాలా విచారకరమన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో మొత్తం 47 ప్రాజెక్టు పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.934 కోట్ల నిధులు వచ్చినట్లు వెల్లడించారు. ఇందులో రూ.765 కోట్ల 62 లక్షలు ప్రాజెక్టు పనులకు విడుదల చేయగా.. దానిలో రూ.735 కోట్ల నిధులు కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు వచ్చాయని తెలిపారు. ఇందులో రూ.732 కోట్ల నిధులను వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేశామని చెప్పారు. బోర్డు డైరెక్టర్ల నిర్ణయం మేరకే ప్రతి ప్రాజెక్టు పని సాంక్షన్ ఇచ్చి టెండర్లు పిలుస్తున్నామని.. ఇందులో ఎవరి సొంత నిర్ణయాలు ఉండవని తేల్చి చెప్పారు.

అభివృద్ధి కోసం ఎవరినైనా కలుస్తాం

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని తమ పాలకవర్గం కలవడం కాంగ్రెస్ నాయకులకు కంటగింపుగా మారిందని, అది ఓర్వలేక పోతున్నారని మేయర్ విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు ఎంపీగా పనిచేసిన కాలంలో కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు నిధులు తీసుకురావడంలో బండి సంజయ్ పాత్ర ఉందని.. ఆయన మళ్లీ కేంద్ర కేబినెట్ మంత్రి అయ్యారు కాబట్టి కరీంనగర్ నగరపాలక సంస్థకు మళ్లీ నిధులు తేవాలని తమ పాలకవర్గం కలిసిందని తెలిపారు. దమ్ముంటే పొన్నం ప్రభాకర్ నగరపాలక సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.200 కోట్లు తేవాలని, అప్పుడు స్వాగతిస్తామని సవాల్ విసిరారు. 2019 నుంచి 2024 వరకు మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ నగరపాలక సంస్థ అభివృద్ధికి రూ.వందల కోట్ల నిధులు తెచ్చి నగరాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధిపై మాట్లాడే హక్కు పొన్నం ప్రభాకర్‌కు లేదని మండి పడ్డారు. 2009 నుంచి 2014 వరకు ఎంపీగా పని చేసిన ఆయన, ఒక్క కాంగ్రెస్ నాయకుడికి పదవి ఇప్పించిన దాఖలా లేదని, ఆ పార్టీ నాయకులు జాగ్రత్త పడాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్లు వాల రమణారావు, గందె మాధవి మహేశ్, ఐలేందర్ యాదవ్, కంసాల శ్రీనివాస్, గుగ్లిళ్ల జయశ్రీ శ్రీనివాస్, కొండపల్లి సరితాసతీశ్, సల్ల శారదారవీందర్, దిండిగాల మహేశ్, ఎడ్ల సరితాఅశోక్, నాంపల్లి శ్రీనివాస్, బోనాల శ్రీకాంత్, తుల శ్రీదేవీ చంద్రమౌళి, కచ్చు రవీందర్, మేచినేని వనజాఅశోక్ రావు, నాయకులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు పుస్తకాల వితరణ

కమాన్‌చౌరస్తా, జూలై 16: జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పుస్తకాలను వితరణ చేశారు. విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసిన అనంతరం ఫౌండేషన్ చైర్మన్ బీఎన్ రావు మాట్లాడుతూ, విద్యావంతులైన యువత దేశానికి తరగని సంపదన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రాంకిరణ్, ఫౌండేషన్ సెక్రటరీ డాక్టర్ ఝాన్సీ, బీఎస్పీ నాయకులు రాంచందర్, ఫౌండేషన్ సభ్యురాలు డాక్టర్ దాదారి శ్రీదేవి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్, స్టడీ సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్ఫోర్స్ టైనీటాల్స్‌లో ప్రమాణ స్వీకారోత్సవం

విద్యార్థులకు బ్యాడ్జ్‌లు అందజేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, జూలై 16 : జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ టైనీటాల్స్‌లో వివిధ విభాగాల కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని, పాఠశాల విభాగం చక్కగా నడిచేలా శ్రద్ధ వహించాలని సూచించారు. ఆ తర్వాత ఎంపికైన వారందరితో ప్రమాణస్వీకారం చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తొలిఏకాదశి వేడుకలు

రామడుగు, జూలై 16 : మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ విద్యాలయంలో మంగళవారం విద్యార్థులు ముందస్తు తొలిఏకాదశి, గోరింటాకు వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు చేతులకు అందమైన ఆకృతులతో గోరింటాకు పెట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో నృత్యాలతో సందడి చేశారు. తొలి ఏకాదశి పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షీ టీంలపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ విజయమణి

కమాన్‌చౌరస్తా, జూలై 16 : జిల్లా కేంద్రంలోని లక్ష్మీనగర్ కాకతీయ ఒలింపియాడ్ పాఠశాలలో షీ టీంలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా, సోషల్ మీడియా, గర్ల్ చైల్డ్ ప్రొటెక్షన్ గురించి విద్యార్థులకు ఏఎస్ఐ విజయమణి, టీం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కామేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ అజయ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్టింటికి వచ్చి వెళ్తుండగా కబలించిన మృత్యువు

- శంకర్‌నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

లక్ష్మి (ఫైల్)

చిగురుమామిడి, జూలై 16: తల్లి ఆరోగ్యం బాగోలేదని చూసేందుకు వచ్చిన కూతురు, ఆమెతో ఒకరోజు గడిపి ఆటోలో తిరిగి అత్తారింటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. వివరాలు ఇవి.. చిగురుమామిడి మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన గోగురు మల్లారెడ్డి, పోచవ్వ దంపతుల కూతురు లక్ష్మికి బెజ్జంకి మండలం రేగులపల్లికి చెందిన కొమ్మెర రాంరెడ్డితో వివాహం జరిగింది. ఇటీవల తల్లి ఆరోగ్యం బాగుండకపోవడంతో పుట్టినిల్లు అయిన సీతారాంపూర్‌కు ఆదివారం ఆమె వచ్చింది. తల్లిదండ్రుల యోగక్షేమాలు తెలుసుకొని మంగళవారం గ్రామానికి చెందిన ఆటోను కిరాయి మాట్లాడుకొని తిరిగి అత్తారింటికి బయలుదేరింది. కోహెడ మండలం శనిగరం సమీపంలోని శంకర్ నగర్ వద్ద మంచిర్యాల నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు ఆటోను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న కొమ్మెర లక్ష్మి (64) అక్కడికక్కడే మృతిచెందింది. ఆటో డ్రైవర్ ముస్కుల అనిల్ రెడ్డి రెండు కాళ్లు విరిగాయి. స్థానికులు బంధువులకు సమాచారం అందించి 108 వాహనంలో ఆటో డ్రైవర్‌ను కరీంనగర్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, తమను చూసేందుకు వచ్చిన కూతురు మృత్యువాత పడడంతో లక్ష్మి తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతురాలి భర్త కొమ్మెర రాంరెడ్డి ఫిర్యాదు మేరకు బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు బంధువులు పేర్కొన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి భరోసా
- వ్యక్తిగతంగా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం

బాధితులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జూలై 16: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో గల పాపారావు బొంద ప్రాంతంలోని సుమారు 30 పండ్ల దుకాణాలు సోమవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదంలో కాలిపోగా, బాధితులకు అండగా ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బాధితులు అధైర్యపడవద్దని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయిలో ఆదుకుంటామన్నారు. చిరు వ్యాపారుల దుకాణాలను పునర్నిర్మించడానికి తనవంతుగా వ్యక్తిగతంగా ఒక్కో బాధితుడికి రూ.10వేలు ఆర్థిక సాయం అందిస్తానన్నారు. మూడు రోజుల్లోగా ప్రభుత్వం చొరవ తీసుకొని ఒక్కో షాపుకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని కోరారు. అగ్ని ప్రమాదం విషయం తెలియడంతో సంధ్యా అనే చిరువ్యాపారి స్పృహ తప్పి పడిపోయి ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, ఆమెను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ గందె రాధిక- శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్ రెడ్డి, మొలుగు సృజన- పూర్ణ చందర్, తాళ్లపల్లి శ్రీనివాస్, కేస్ రెడ్డి లావణ్య- నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన నాయకులు

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో గల అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎడవెల్లి కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పరిశీలించారు. బాధితులను పరామర్శించి, భరోసా కల్పించారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

హుజూరాబాద్ రూరల్, జూలై16: అగ్ని ప్రమాదంలో నష్టపోయిన 10 మంది పేద చిరు వ్యాపారులకు ఏసీపీ శ్రీనివాస్‌జీ మంగళవారం రూ 3వేల చొప్పున రూ 30వేలు తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో హుజూరాబాద్, జమ్మికుంట సీఐలు రమేశ్, రవి, వెంకటయ్యతో పాటు సబ్ డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే బాధితులకు సిర్సపల్లి గ్రామానికి చెందిన సామాజిక వేత్త సబ్బని వెంకట్ ఒక్కొకరికి రూ.5వేల చొప్పున అందజేశారు.

బ్లూబెల్స్‌లో ఉచిత రక్త పరీక్ష శిబిరం

బ్లూబెల్స్ పాఠశాలలో తల్లిదండ్రులకు పరీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, జూలై 16 : జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాలలో మంగళవారం పాఠశాల ఆవరణలో ఉచిత రక్త పరీక్ష శిబిరం నిర్వహించారు. తొమ్మిది, 10వ తరగతి విద్యార్థులు జీవశాస్త్ర పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు రక్త పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జంగ సునీతా మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది సమక్షంలో పరీక్షలు నిర్వహించి, బ్లడ్ గ్రూప్ వెల్లడించినట్లు చెప్పారు.

సెయింట్ జార్జ్ సీబీఎస్ఈలో కౌన్సిల్ ఎన్నికలు

ఓటింగ్‌లో పాల్గొన్న సెయింట్ జార్జ్ విద్యార్థులు

కొత్తపల్లి, జూలై 16 : కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ (సీబీఎస్ఈ) పాఠశాలలో మంగళవారం కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ టీ ప్రసాద్ ఆధ్వర్యంలో పిల్లలకు ఎన్నికలు, రాజకీయ నాయకులపై అవగాహన కల్పించారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, ఈవెంట్ అపైర్స్ ఇన్‌చార్జి విభాగాలకు ఎన్నికలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. పాఠశాల చైర్మన్ డా. పి ఫాతిమా రెడ్డి విజేతలుగా నిలిచిన అభిషేక్, ప్రేసి, జస్రజ్, సన్నిధి, అవినాష్, విశ్వకు అభినందనలు తెలిపారు. పాఠశాల స్థాయిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా విద్యార్థులు ఉత్తమ నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.నిరంజన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారమిత విద్యార్థినికి టెడ్ నెక్స్ట్ అమెరికా ఆహ్వానం

విద్యార్థినిని అభినందిస్తున్న ప్రసాద రావు

కమాన్‌చౌరస్తా, జూలై 16 : జిల్లా కేంద్రంలోని పారమిత టెడ్-ఎడ్ క్లబ్‌కు చెందిన విద్యార్థిని కన్నం వర్షిణికి అక్టోబర్ 22 నుంచి 24 వరకు అమెరికాలోని అట్లాంటాలో జరుగబోయే టెడ్-నెక్స్ట్ సమావేశంలో అతిథిగా పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని టెడ్-క్లబ్ ఎడ్యుకేటర్ కే హన్మంతరావు తెలిపారు. వర్షిణి 2019 సంవత్సరంలో తన మొదటి టెడ్-ఎడ్ టాక్ లో 'తల్లిదండ్రులు -ఉపాధ్యాయులు పిల్లలను ఎలా అర్థం చేసుకోవాలి' అంశంపై మాట్లాడగా, ఈ టాక్‌ను 2019లో అమెరికా టెడ్ ప్రధాన కార్యాలయం 191 దేశాల్లో ప్రచురించింది. ఈ క్రమంలో అమెరికాలో ప్రారంభించిన టెడ్-ఎడ్ టాక్స్ పది సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా అమెరికా, జార్జియా రాష్ట్రంలోని అట్లాంటాలో అక్టోబర్‌లో నిర్వహించే టెడ్-నెక్స్ట్ సమావేశంలో అతిథులుగా పాల్గొనేందుకు దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందులో మూడంచెల ఎంపిక విధానాన్ని పారమిత టెడ్-క్లబ్ ఎడ్యుకేటర్ కె. హన్మంతరావు వర్షిణి, మధుమోహన్, శ్రీవల్లిని నామినేట్ చేయగా, కన్నం వర్షిణి ఎంపికైనట్లు ఆయన వివరించారు. ఈ మేరకు పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాదరావు విద్యార్థినిని అభినందించారు. పారమిత టెడ్-ఎడ్ క్లబ్ అమెరికా సమావేశానికి భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించడం చాలా గర్వంగా ఉందని చెప్పారు. ఇక్కడ పాఠశాల డైరెక్టర్లు ఉన్నారు.

హోటల్స్‌లో బల్దియా అధికారుల తనిఖీలు

కార్పొరేషన్, జూలై 16: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పలు హోటల్స్, దాబాల్లో నగరపాలక అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ట్రేడ్‌లైసెన్స్ లేని, నాణ్యత లేని ముడి సరుకులు వినియోగిస్తున్న పలు హోటల్స్‌కు రూ. 18 వేల వరకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో నగరపాలక అధికారులు శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పోను విజయవంతం చేయాలి

హుజూరాబాద్ రూరల్, జూలై 16: హైదరాబాద్‌లో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగే ఫొటో ఎక్స్‌పో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు మాచర్ల రాజు గౌడ్ కోరారు. ఈమేరకు ఎక్స్‌పో పోస్టర్‌ను పట్టణంలో మంగళవారం ఆవిష్కరించారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సిరి రవి, రాష్ట్ర గౌరవ సలహాదారు కేదార్ రెడ్డి. జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ చెందు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

మానకొండూర్, జూలై 16: భవిష్యత్ తరాల మేలుకోసం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి మాట్లాడుతూ, వనమహోత్సంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పీఎంసీ నిధులతో బాలుర ఉన్నత పాఠశాలలో రూ. 13 లక్షల 50వేలతో చేపట్టిన సైన్స్‌ల్యాబ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్‌రావు, ఎంఈవో మధుసూదనాచారి, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఈజీఎస్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి, నందగిరి రవి, గసిగంటి సంపత్, కోండ్ర శంకర్ పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

తిమ్మాపూర్, జూలై 16: తిమ్మాపూర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఉర్సు పోస్టర్ ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, జూలై 16: జిల్లా కేంద్రంలోని అల్లునూర్ తీగలవంతెన సమీపంలో ఉన్న హజ్రత్ సయ్యద్ షేర్ అలీ బాబా 61వ ఉర్సు గోడపత్రికను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తామని దర్గా కమిటీ అధ్యక్షుడు వాజిద్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి వీణాధరి విద్యార్థి ఎంపిక

చొప్పదండి, జూలై 16: మండల కేంద్రంలోని వీణాధరి పాఠశాలకు చెందిన హర్షవర్ధన్ పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించి, అత్యంత ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ఐటీకి ఎంపికైనట్లు కరస్పాండెంట్ తిప్పర్తి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో విద్యార్థిని అభినందించారు.

కేక్ కట్ చేసి.. స్వీట్లు పంచి

మానకొండూర్, జూలై 16: బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్ జన్మదిన వేడుకలను పార్టీ మండల శాఖ, వివిధ అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని పల్లెమీద చౌరస్తావద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షుడు ఆడప శ్రీనివాస్, మానకొండూర్ సింగిల్‌విండో అధ్యక్షుడు నల్ల గోవిందరెడ్డి, నాయకులు శాతరాజు యాదగిరి, పడాల సతీశ్‌గౌడ్, పిట్టల మధు, నెల్లి మురళి, దండబోయిన శేఖర్, పిండి సందీప్, బోడ రాజశేఖర్, పంజాల శ్రీనివాస్‌గౌడ్, గడ్డి గణేశ్, గోపు ఈశ్వర్‌రెడ్డి, నామాల శ్రీనివాస్, కోండ్ర నిర్మల, అనవేని రాజు, గంగుల రవి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలి

తెలంగాణచౌక్, జూలై 16: సింగరేణి బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం (బద్దం ఎల్లారెడ్డి భవనం)లో నిర్వహించిన ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న. ప్రధాన కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, గౌరవాధ్యక్షుడు లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు దామోదర్, నాయకులు శ్రీనివాస్, శంకర్, సాయిలు, బీరయ్య పాల్గొన్నారు.

16 మంది బాలకార్మికుల గుర్తింపు

కలెక్టరేట్, జూలై 16: ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 16 మంది బాలకార్మికులను గుర్తించినట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి తెలిపారు. వీరందరిని బాలల సంక్షేమ కమిటీ ఎదుట ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా బాలకార్మికులతో పనులు చేయిస్తున్న ఐదుగురు యజమానులపై కేసులు నమోదు చేయగా, మరో ఆరుగురికి నోటీసులు జారీ చేసినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ముకాస మండలాధ్యక్షుడిగా అనిల్

గంగాధర, జూలై 16 : మున్నూరుకాపు సంఘం మండలాధ్యక్షుడిగా మండలంలోని గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన కోల అనిల్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేశ్, బండి సంజీవ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం గంగాధరలో అ